క్లుప్తంగా

10న సామాజిక తనిఖీ ప్రజావేదిక సభ

పెద్దకొత్తపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 10వ తేదీన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగేందర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు నిర్వహించిన ఉపాధి పనులకు సంబంధించిన నివేదికలను సామాజిక తనిఖీ ప్రజావేదిక బహిరంగ సభలో సమర్పిస్తారని తెలిపారు. సమావేశానికి ఆయా గ్రామాల రైతులు, కూలీలు, పోస్టల్ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు హాజరుకావాలని కోరారు.

కాంగ్రెస్ నాయకుడికి పరామర్శ

మన్ననూర్: అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్లబావికి చెందిన కాంగ్రెస్ నాయకుడు అంబ నారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇదిలా ఉండగా అతని తండ్రి కృష్ణయ్య అకస్మాత్తుగా ఆదివారం మృతిచెందాడు. తండ్రిని చివరి చూపు కోసం ఆస్పత్రి నుంచి అంబనారాయణకు తీసుకొచ్చారు. సాంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు వెంకటరమణ, రహీం, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, శివాజీ బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

హమాలీల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



కొల్లాపూర్: హమాలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పట్టణంలో రైస్‌మిల్ హమాలీలతో సమావేశం అయ్యారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్మికుల సంక్షేమంపై పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను కాలరాసేవిధంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కార్మికులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పింఛన్ సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో ఈదన్న, సత్యనారాయణ, సంగెం, ఎల్లయ్య, పకీరా, రాముడు, రామకృష్ణ తదితరులు ఉన్నారు.

పోడు భూములకు పట్టాలివ్వాలి

కొల్లాపూర్ రూరల్: జిల్లా వ్యాప్తంగా గిరిజనులు శిస్తూ చేసుకుంటున్న పోడు భూములకు ప్రభుత్వం వెంటనే పట్టాలివ్వాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ముక్కిడిగుండంలో మండల స్థాయి గిరిజన సంఘం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కొందరికి మాత్రమే పట్టాలిచ్చారని ఇంకా చాలా మంది అర్హులైన వారు ఉన్నారన్నారు. పట్టాలు లేని వారిని ఫారెస్టు అధికారులు నిరంతరం ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి మిగిలిన గిరిజన పోడు రైతులకు పట్టాలిచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన కౌన్సిలర్

కొల్లాపూర్: పట్టణంలోని కేజీబీవీ పాఠశాలను మున్సిపల్ కౌన్సిలర్ రహీంపాషా ఆదివారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాలను ఆయన పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాలు వడ్డించాలని, నాణ్యమైన ఆహార పదార్థాలను వంటకు వినియోగించాలని సూచించారు. అక్కడి వసతుల గూర్చి విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలను మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు.

సబ్సిడీ స్ప్రింక్లర్ పైపులు అందజేత



పెంట్లవెల్లి: మండలంలోని ఎంగంపల్లి తండాలో సబ్సిడీ స్ప్రింక్లర్ పైపులను ఆదివారం మాజీ సర్పంచ్ గోపినాయక్ పలువురు కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోపినాయక్ మాట్లాడుతూ మంత్రి జూపల్లి కృష్ణారావు స్ప్రింక్లర్ పైపులను మంజూరు చేయించారన్నారు. మంత్రికి గ్రామస్తులు, రైతులు తెలిపారు.

అధ్వానంగా రోడ్లు

- మరమ్మతులకు నోచుకోని వైనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



జక్లీసదగోడు- మొల్గర మధ్యలో కోతకు గురైన రోడ్డు



ఉప్పునుంతల- కొత్తరాంనగర్ మట్టి రోడ్డు

ఉప్పునుంతల: మండలంలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉంది. బీటీ రోడ్ల నిర్వహణలేక పూర్తిగా దెబ్బతిన్నాయి. గ్రామాలను కలుపుతూ ఉన్న అంతర్గత రోడ్లు మరింతగా అధ్వానస్థితికి చేరుకున్నాయి. ఏళ్ల తరబడిగా మరమ్మతులకు నోచుకోని రోడ్లపై ప్రయాణించడం ప్రజలకు నరకయాతనగా మారింది. రోడ్లను బాగుచేయించడంలో సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఏమాత్రం పట్టింపులేకుండ ఉంది. కొన్నేళ్లుగా గ్రామీణ రోడ్ల నిర్వహణను గాలికొదిలేయడంతో మరీ అధ్వానంగా తయారైన రోడ్ల వెంట వెళ్లడానికి ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మట్టి రోడ్లు మరింత అధ్వానంగా తయారయ్యాయి. కొన్నేళ్లుగా మట్టి రోడ్ల అభివృద్ధిపై శ్రద్ధ పెట్టకపోవడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. వర్షాలకు రోడ్లపై గోతులు ఏర్పడ్డాయి. రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు కమ్ముకొని బండ్ల డొంకలను తలపిస్తున్నాయి. గతంలో మెటల్ రోడ్లుగా వేసి తర్వాత పట్టించుకోకపోవడంతో కంకర లేసిపోయి రోడ్లపై వెళ్లడం కష్టంగా మారింది. ఉప్పునుంతల నుంచి రాకొండ వరకు బీటీ రోడ్డు రెన్యూవల్ మంజూరైనా పనులు చేపట్టలేదు.

దెబ్బతిన్న మట్టి రోడ్లు

మండలంలో గ్రామాలకు అనుసంధానంగా ఉన్న రోడ్లు మరింతగా అధ్వానంగా తయారయ్యాయి. ఉప్పునుంతల నుంచి కొత్త రాంనగర్ రోడ్డు, ఉప్పునుంతల నుంచి పెద్దాపూర్, మొల్గర- ఉప్పునుంతల రోడ్ల వెంట కంపచెట్లు కమ్ముకున్నాయి. మర్రిపల్లి నుంచి గట్టుతుమ్మెన్ స్టేజీ వరకు రెండున్నర కిలోమీటర్ల దూరం ఉన్న రోడ్డుపై కంకర లేసి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా మర్రిపల్లి నుంచి లక్ష్మాపూర్ వరకు ఉన్న రోడ్డు వెంట కంకర లేసి వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. దాసరల్లిపల్లి నుంచి పెద్దాపూర్ వరకు, సదగోడు నుంచి తిర్మలాపూర్ వరకు, కొరటికల్ నుంచి చాకలి గుడిసెల వరకు మట్టి రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి, అదేవిధంగా కొరటికల్ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి వెల్టూరు వరకు ఉన్న లింక్‌రోడ్డు పరిస్థితి మరింత ఇబ్బందిగా ఉంది. కాంసానిపల్లి తండా నుంచి రంగంపేట మీదుగా ఉన్న మెటల్ రోడ్డుపై వేసిన కంక లేసింది. కంకర రాళ్లతో రోడ్డుపై ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి కష్టంగా ఉంది.

తూతూ మంత్రంగా బీటీ రోడ్ల మరమ్మతు

మండలంలోని బీటీ రోడ్ల వెంట తూతూ మంత్రంగా నిర్వహణ పనులు చేస్తున్నారు. ఉప్పునుంతల నుంచి మర్రిపల్లి వరకు గతేడాది ఎన్నికల ముందు హడావిడిగా బీటీ రోడ్డును రెన్యూవల్ చేసిన కాంట్రాక్టర్ రోడ్డు అంచుల వెంబడి మట్టి సరిగా వేయకుండ వదిలేశాడు. ఎదురెదురు వాహనాలు వచ్చినప్పుడు రోడ్డు పక్కకు వెళ్తే అదుపు తప్పే పరిస్థితి ఉంది. తాడూరు నుంచి ఉప్పునుంతల వరకు బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిని వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపుల కంపచెట్లు కమ్ముకొని ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చేంతవరకు కన్పించకపోవడంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. తాడూరు సమీపంలో రోడ్డు పూర్తిగా ఇబ్బందిగా ఉంది. ఈరట్యానిపల్లి నుంచి పెనిమిళ్ల వరకు, పెనిమిళ్ల నుంచి సీబీ తాండా వరకు ఉన్న బీటీ రోడ్లు గుంతలమయంగా మారాయి.

ప్రతిపాదనలు పంపించాం

మండలంలో ఉన్న పీఆర్ పరిధిలోని బీటీ రోడ్ల రెన్యూవల్ కోసం, మట్టి రోడ్ల అభివృద్ధి కోసం ప్రతిపాదనలు పంపించాం. ఇటీవల ఉప్పునుంతల నుంచి పల్కపల్లి వరకు బీటీ రోడ్డుగా అభివృద్ధి కోసం మాత్రం సీఆర్ఆర్ నిధులు రూ.4.50 కోట్లు మంజూరు అయ్యారు. ఇటీవల పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క పనులకు భూమి పూజ చేశారు.

– చంద్రకళ, పీఆర్ డీఈఈ అచ్చంపేట

అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తా



జకినాలపల్లిలో తురకచెరువు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

ఊర్కొండ: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తానని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ముచ్చర్లపల్లి, ఇప్పపహాడ్ గ్రామాల్లో సీసీ రోడ్లు, గుండ్ల గుంటపల్లిలో అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి, జకినాలపల్లిలో రూ.5.74 కోట్లతో అభివృద్ధి చేయనున్న తుర్క చెరువు నిర్మాణ పనులకు, రాచాల పల్లి వద్ద రూ.2 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా 108 వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం జకినాల పల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. సంవత్సర కాలంలోనే ఇచ్చిన హామీలు అమలు చేయడమే కాకుండా కొత్తవి కూడా అమలు చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. రైతు భరోసా సంక్రాంతి తర్వాత అకౌంట్లలో జమ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య గౌడ్, కాంగ్రెస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ సర్పంచ్ ద్యాప నిఖిల్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్, మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమి, కాంగ్రెస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు ఆదినారాయణ, నాయకులు పర్వత్ రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి, పోలె శంకర్, మనోహర్ రెడ్డి, ధర్మేందర్ రెడ్డి, అరిఫ్, జంగారెడ్డి తదితరులు ఉన్నారు.

మహాసభల వాల్‌పోస్టర్ విడుదల

కల్వకుర్తిరూరల్: అచ్చంపేటలో 14, 15వ తేదీలలో నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆంజనేయులు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయం వద్ద జిల్లా మహాసభల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. మల్లయ్య, పరశురాముడు, బాల్‌రెడ్డి, కిషోర్, జమాలుద్దీన్, శ్రీనివాసులు, యాదయ్య, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.


ఉప్పునుంతల: మండలంలోని రాయిచెడ్, కాంసానిపల్లిలో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు విడుదల చేశారు. మండల కార్యదర్శి చింతల నాగరాజు, నాయకులు మల్లేష్, రామస్వామి, రాములు, కిష్టయ్య, నిరంజన్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

తెల్కపల్లి: అచ్చంపేట పట్టణంలో 14, 15 తేదీలలో నిర్వహించే సీపీఎం జిల్లా 3వ మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆ పార్టీ నాయకులు మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆర్. శ్రీనివాసులు మాట్లాడుతూ సీపీఎం పొలిట్‌బ్యూరోసభ్యుడు బీవీ రాఘవులు, ప్రజాకవి ఎమ్మెల్సీ గోరటివెంకన్న, జాన్‌వెస్లీ, టీ.సాగర్‌తో పాటు జిల్లా నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపాస్ లక్ష్మణ్, విజయ్ గౌడ్, కాశన్న, జగదీశ్, హుస్సేన్ పాల్గొన్నారు.



కల్వకుర్తిలో పోస్టర్ విడుదల చేస్తున్న ఆంజనేయులు తదితరులు

ఉపాధి హామీ పనులపై గ్రామసభ



పెద్దకొత్తపల్లి: మండలంలోని యాపట్లలో ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై ఆదివారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో గతేడాది నిర్వహించిన 19 పనులపై సామాజిక తనిఖీ బృందం విచారణ చేసిన అనంతరం పనుల వివరాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ మంజుల, డీఆర్‌బీ రాములమ్మ, టీఏ శ్రీనయ్య, కార్యదర్శి పరశురాం, మాజీ సర్పంచ్ సీతారాం నాయక్, జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



పెంట్లవెల్లి: మండలంలోని గోపులాపురం నాల్గో వార్డులో తాగునీటి సమస్య తలెత్తింది. తాగడానికి నీరులేక ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో ఆదివారం కాలనీవాసులు ఖాళీ బిందెలతో రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించాలని కోరారు.

క్షయ రహిత మండలంగా తీర్చిదిద్దుదాం



పాన్‌గల్: మండలాన్ని క్షయ రహిత మండలముగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పీహెచ్‌సీ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షయ(టీబీ) నివారణ కోసం 100 రోజుల పాటు విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించినట్లు తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పరీక్షలు నిర్వహించి క్షయ రోగులను గుర్తించి సత్వరం వైద్యం అందించడం ప్రచార కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమన్నారు. రోగుల వద్ద అంబులెన్స్ వాహనం వచ్చి పరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఈనెల 9వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి నెల వరకు కొనసాగుతుందన్నారు. గ్రామాలకు వచ్చే వైద్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుల్జాభవాని మాతకు ప్రత్యేక పూజలు



ఉప్పునుంతల: మండలంలోని లత్తీపూర్‌లో నూతనంగా నిర్మించిన తుల్జా భవాని మాత ఆలయంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాజీ ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లేష్, నరేష్‌యాదవ్, గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు ఐజేయూ ఆత్మీయ సమ్మేళనం

కొల్లాపూర్ రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సోమవారం డివిజన్ స్థాయి ఐజేయూ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ టీయూడబ్ల్యూజే మాలే రాజేందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో మీటింగ్ హాల్‌లో సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జర్నలిస్టులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఎమ్మెల్యే రాక

చారకొండ: మండల కేంద్రంలో సోమవారం అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ పర్యటిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. నూతనంగా మంజూరు అయిన 108 అంబులెన్స్‌ను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం

చిన్నంబావి: వచ్చే స్థానిక ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతుందని ఆపార్టీ రాష్ట్ర నాయకుడు ధారాసింగ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏడాది పాలనలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. హామీలను నెరవేర్చని కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో పండుగలను చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కంటే కాంగ్రెస్ ఏడాది పాలనలోనే అధిక నష్టం జరిగిందని ఆరోపించారు. అమాయక ప్రజల ఆస్తులను కొల్లగొట్టడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. జగ్గారి శ్రీధర్ రెడ్డి, గోపినాయుడు, నాగేంద్రం నాయుడు, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

సైబర్‌మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

వీపనగండ్ల: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రాణి ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా ఆన్‌లైన్ ద్వారా కొద్దిపాటి డబ్బులు చెల్లిస్తే రూ. లక్షల్లో లోన్లు మంజూరు చేస్తామని సైబర్ నేరగాళ్లు ప్రజలకు వల విసురుతున్నారన్నారు. వీటితో పాటు యువత చెడు వ్యవసనాలకు బానిసలు కాకుండా ఉన్నత చదువుల్లో రాణించాలని విజ్ఞప్తి చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత



అయ్యప్ప మాలధరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: ఆధ్యాత్మికతతో ప్రశాంతత కలుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఆదివారం శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో ఆయన అయ్యప్ప మాల ధరించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పట్టణంలోని పలు వార్డులలో ఆయన అభివృద్ధి పనులు పరిశీలించారు. పనులను నాణ్యతగా చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. సోమవారం సోనియాగాంధీ జన్మదిన వేడుకలను నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించేందుకు కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పట్టణంలో అయ్యప్ప మహాపడి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, ఈఓ శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, అయ్యప్ప మాలధారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తాం



పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమ్య

కొల్లాపూర్/కొల్లాపూర్‌రూరల్: పట్టణంలోని ప్రతి ఇంటికీ రక్షిత మంచినీరు రెగ్యులర్‌గా అందేలా చూస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యనాగరాజు వెల్లడించారు. సింగోటం నుంచి కొల్లాపూర్ పట్టణానికి వేసిన మిషన్‌భగీరథ పైప్‌లైన్ మరమ్మతు పనులను ఆదివారం ఆమె పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని వాటర్‌లైన్‌మెన్లకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పైప్‌లైన్లు ఏడు చోట్ల దెబ్బతిన్నాయని, వాటన్నింటికీ మరమ్మతు చేస్తున్నట్లు తెలిపారు. మరమ్మతు కారణంగా కొన్నిచోట్ల తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటన్నింటికీ మరమ్మతు చేసి తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తామన్నారు. ఆమె వెంట కౌన్సిలర్లు రహీంపాషా, నయూమ్, నాయకులు ఎల్లగౌడ్, వాసు, బోరెల్లి మహేష్, రెడ్డి సత్యం తదితరులు ఉన్నారు.

వరప్రదాయిని సర్వోదయ విద్యాసంస్థలు



సమావేశంలో పాల్గొన్న దివ్యాంగులు

నాగర్‌కర్నూల్‌రూరల్: సర్వోదయ విద్యాసంస్థలు దివ్యాంగులకు అందిస్తున్న సేవలు ఎనలేనివని రాష్ట్ర దివ్యాంగుల సంఘం నాయకులు నాగభూషణం అన్నారు. ఆదివారం సర్వోదయ విద్యాసంస్థల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులకు విద్య, వైద్య సేవలు అందించి వారి భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సర్వోదయ విద్యాసంస్థ వ్యవస్థాపకులు భూదానం సుబ్బారావు, చైల్డ్ రైట్స్ ఫోరం బాధ్యులు మధు, వేణు, కోఆర్డినేటర్ లలితమ్మ, బాలపీరు, వందన, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



వెల్దండలో ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

వెల్దండ: మండలంలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన సలేశ్వరం ఇటీవల మృతి చెందాడు. 1998వ సంవత్సరం పదో తరగతి చెందిన మిత్రులు డబ్బులను పోగు చేసుకొని మొత్తం రూ.85వేలు మృతుడి కుమార్తె పేరుపై డిపాజిట్ చేశారు. కార్యక్రమంలో మిత్రులు సురేష్‌కుమార్, అంజన్‌కుమార్, తిరుపతి, తిరుపతయ్య, సుశీల్, రవీందర్ రెడ్డి, కొండల్, తారక రామారావు, జక్కుల శ్రీను, శ్రీనునాయక్,కృష్ణ, యాదగిరి, పురోత్తంరెడ్డి, మల్లికార్జున్, ఈదమన్న, కిరణ్‌కుమార్, అన్వర్ బేగం తదితరులు ఉన్నారు.

చారకొండ: మండలంలోని గోకారం గ్రామానికి చెందిన దామర్ల విజేందర్ కొన్ని రోజులుగా గొంతు సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొంది అతని నివాసంలో విశ్రాంతి పొందుతున్నారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పగడాల అంజనేయులు బాధితుడిని పరామర్శించి రూ.13వేలు ఆర్థికసాయం అందజేశారు. నాయకులు జనార్దన్, మహేష్, వెంకటయ్య, నర్సింహ్మా, లక్ష్మయ్య, రమేష్, భాస్కర్, అనిల్, రామకృష్ణ గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

బీఆర్ అంబేడ్కర్ జీవితం ఆదర్శం



తాడూరు: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జీవితం ఆదర్శమని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ అన్నారు. ఆదివారం మండలంలోని అంతారంలో అంబేడ్కర్ 68వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీడిత ప్రజానీకం కోసం నిరంతరం పోరాడిని మహానుభావుడు అంబేడ్కర్ అని కొనియాడారు. ఇప్పటికీ అసమానతలు కులవివక్ష కొనసాగడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, రాజు, అంజనేయులు, హనుమంతు, వెంకటయ్య, నర్సమ్మ, అలివేల పాల్గొన్నారు.

ఆటో, ద్విచక్రవాహనం ఢీ: వ్యక్తికి తీవ్రగాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: ఆటో, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చందుబట్ల గ్రామానికి చెందిన రవీందర్ గౌడ్ జిల్లా కేంద్రంలో పనులు ముగించుకొని ద్విచక్రవాహనంపై తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. కొల్లాపూర్ చౌరస్తాలో బైక్‌ను ఆటో ఢీకొన్నది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న రవీందర్‌గౌడ్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



కొల్లాపూర్ రూరల్: జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు పట్టణంలోని బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థిని నందిని ఎంపికైంది. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీలలో ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ నెల 9న మహారాష్ట్రలోని అమరావతిలో నిర్వహించే ఎస్జీఎఫ్ అండర్- 14 కబడ్డీ పోటీలలో పాల్గొంటుందని తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాల్సిన పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులను తక్షణమే విడుదల చేయాలని బీసీ పొలిటికల్ జేఏసీ నాయకులు అరవిందాచారి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పాత బకాయిలు విడుదల చేయకపోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ నెల 10వ తేదీ లోపు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయకపోతే కలెక్టరేట్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

సీఎంను కలిసిన కొత్తపల్లి వినోద్‌కుమార్



తాడూరు: సీఎం రేవంత్‌రెడ్డిని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కొత్తపల్లి వినోద్‌కుమార్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసారు. సంక్షేమ అభివృద్ధి, 6 గ్యారంటీల హామీల అమలుపై ప్రజలకు వివరించాలని సీఎం సూచించినట్లు ఆయన పేర్కొన్నారు.

ట్రాక్టర్ పట్టివేత

కొల్లాపూర్ రూరల్: మండలంలోని రామాపురం గ్రామ సమీపంలో ఉన్న వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన ఉడుత నాగన్న ట్రాక్టర్‌ను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. యజమాని నాగన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ హృషికేష్ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటంలో అనారోగ్యంతో చింతకుంట శ్రీనివాసులు, తుపాకులు వెంకటమ్మ, డి. వెంకటస్వామిలు బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ఆదివారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. అదేవిధంగా మృతిచెందిన రసాల కళావతి, కోళ్ల సాయి కృష్ణ కుటుంబాలను ఆయన పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మాచినేనిపల్లి సింగిల్ విండో చైర్మన్ చింతకుంట శ్రీనివాసులు, యాదన్నగౌడ్, పాల్గొన్నారు.